

పేదలతో ఉదారంగా వ్యవహరించాలి : ఆళ్ల నాని

ఏలూరు టౌన్:పేద ప్రజలకు మంచి చేసే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని ఆళ్ల నాని అధికారులకు సూచించారు. స్థానిక 29వ డివిజన్ 7,8 సచివాలయాల పరిధిలో ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆయన బుధవారం అధికారులతో సమీక్షించారు. కుమ్మరిరేవు ప్రాంత పేదప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు, వారి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజారోగ్యం, పారిశుధ్యం, వీధిలైట్లు, డ్రెయిను తదితర సమస్యలను సత్వరం పరిష్కరించాలని, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా 29వ డివిజన్ పరిధిలో సుమారు రూ.60 లక్షల అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. కార్పొరేటర్ సుజిత సన్నీ, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్ ఎస్.నుధీర్ బాబు, కో ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతకు గుబులు..!

- జిల్లాలో పలుచోట్ల వర్షపు జల్లులు
- మబ్బులు, చలిగాలులతో వణికిస్తున్న వాతావరణం
- రెండు జిల్లాల్లో 60 శాతానికిపైగా
- ఖరీఫ్ పంట పొలాల్లోనే
- వర్షాలు కొనసాగితే తీవ్రంగా నష్టపోనున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలతో రైతులు విసుగు
- దళారులకే అత్యధిక ధాన్యం విక్రయం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వాతావరణంలో మార్పులతో జిల్లావ్యాపంగా పలుచోట్ల చిరుజల్లులు పడటంతో రైతుల్లో తీవ్ర గుబులు నెలకొంది. చేతికొచ్చిన పంట ఇంటికి చేరుతుందో లేదోననే ఆందోళనతో అన్నదాతకు కంటిమీద కునుకులేకుండా పోయింది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 60 శాతానికిపైగా ఖరీఫ్ పంట ఇంకా పొలాల్లోనే ఉంది. ఏదైనా తేడా వస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. దీంతో జిల్లా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.11 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ప్రస్తుతం ముమ్మరంగా రెండు జిల్లాల్లోనూ వరికోతలు సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో అత్యధికంగా మాసూళ్లు పూర్తవ్వగా మిగిలిన జిల్లాల్లో పదిశాతం వరకూ ఖరీఫ్ మాసూళ్లు పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలంలో అత్యధికంగా 50 శాతం వరకూ మాసూళ్లు పూర్తవగా మిగిలిన మండలాల్లో 25 శాతానికిపైగా కోతలు అయినట్లు చెబుతున్నారు. రెండు జిల్లాలోనూ సరాసరిన లెక్కిస్తే ఇంకా 60 శాతానికిపైగా పంట పొలాల్లోనే ఉందని స్పష్టమవుతోంది. వాయుగుండం ప్రభావంగా గడిచిన నాలుగైదు రోజులుగా వాతావరణం మేఘావృతమైంది. మబ్బులు, చలిగాలులతో చీకటి కమ్ముకున్నట్లు వాతావరణం ఉంటుంది. నిడమర్రు మండలంతోపాటు పలు మండలాల్లో బుధవారం వర్షపు జల్లులు పడ్డాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చేతికొచ్చిన పంట దక్కకుండా పోతుందేమోననే భయం వెంటాడుతోంది. వేగంగా కోతలు కోసేందుకు సైతం వీల్లేకుండాపోయింది. కోత మిషన్ ద్వారా మాసూళ్లు చేసిన ధాన్యం ఆరబెట్టాల్సి ఉంటుంది. అలా చేయాలంటే ఎండ ఉండాలి. వాతావరణంలో మార్పులతో గడిచిన మూడురోజులుగా సరిగా ఎండలు లేని పరిస్థితి ఉంది. మరోపక్క చినుకులు పడుతుండటంతో కోత కోస్తే నష్టపోతామనే భయం రైతులను వెంటాడుతోంది. దీంతో ముందుకు సాగలేక ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షం కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతింటే పెద్దఎత్తున నష్టం చవిచూడాల్సి ఉంది. డిసెంబర్ పదో తేదీ వరకూ వాతావరణం అనుకూలంగా ఉంటే ఖరీఫ్ మాసూళ్లు దాదాపు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. పరిస్థితి చూస్తే మాత్రం రోజురోజుకీ ఆందోళనకరంగా మారుతోంది. దీంతో రైతులు నిలువునా వణికిపోతున్నారు.

దళారులకే అత్యధిక ధాన్యం విక్రయం

ప్రస్తుతం పూర్తయిన ఖరీఫ్ మాసూళ్లకు సంబంధించిన ధాన్యంలో అత్యధికం దళారులే కొనుగోలు చేసినట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఆరబెట్టే పరిస్థితి లేకపోవడంతో పలుచోట్ల రైతులు తడిపొడి ధాన్యం విక్రయించేస్తున్నారు. దళారులు తడిపొడి ధాన్యం కొనుగోలు చేయడంతో ధర గురించి ఆలోచించకుండా రైతులు అయినకాడికి అమ్ముకుంటున్నారు. 75 కిలో ధాన్యం బస్తా రూ.1300కు ఇచ్చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 17 శాతంలోపు తేమ ఉంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామనే నిబంధనలు విధించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ధాన్యం ఆరబెట్టే అవకాశం లేకపోవడంతో అయినకాడికి రైతులు అమ్మేసుకుంటున్నారు. 40 శాతం వరకూ మాసూళ్లు పూర్తయినప్పటికీ పశ్చిమగోదావరి జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో కొన్న ధాన్యం 20 వేల మెట్రిక్ టన్నుల మాత్రమేనని తెలుస్తోంది. ఏలూరు జిల్లాలోనూ ధాన్యం కొనుగోలులో దళారుల హవానే నడుస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణంలో మార్పులతో రైతులు ఖరీఫ్ పంటను అయికాడికి అమ్ముకుంటూ నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావులేదు

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై ఇఆర్ఓ, ఎఇఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని, జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుండి తొలగింపునకు గురికాకుండా చూడాలన్నారు. ఓటరు సవరణలో భాగంగా అందిన ఫారం-6, ఫారం-7, ఫారం-8లను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. బిఎల్ఒలు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో పరిశీలించేలా పర్యవేక్షించి, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో సవరణపై అందిన ఫిర్యాదులు, మీడియాలో వచ్చిన కథనాలపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. అధికసంఖ్యలో చేర్పులు, తొలగింపులు ఉన్న జాబితాలో సమగ్రంగా పరిశీలించాలని, అందుకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలో డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంపై పోలింగ్ బూత్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఎన్‌డిసి గీతాంజలి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సాంబశివరావు

సైన్స్ మేజిక్ శిక్షణ శిబిరం నిర్వహణ అభినందనీయం

స్కూల్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ డి.సాంబశివరావు

ప్రజాశక్తి - ఏలూరు


హేలాపురి బాలోత్సవ కమిటీ విద్యార్థుల్లో సృజనాత్మకతను, నూతన ప్రయోగాల పట్ల ఆసక్తిని, విజ్ఞాన అభివృద్ధిని పెంచడం కోసం సైన్స్ మేజిక్ శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ డి.సాంబశివరావు అన్నారు. స్థానిక ఎఆర్‌డిజికె హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ మేజిక్ శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి విజెఎంఏవిఆర్.కృష్ణారావు అధ్యక్షత వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.దేవేంద్ర మేజిక్ శిక్షణిచ్చి వివరించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు జి.శారద, వి.సురేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 90 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుండి హాజరై మేజిక్‌లో శిక్షణ పొందారు. ముఖ్య అతిథి డి.సాంబశివరావు మాట్లాడుతూ ఇక్కడ తీసుకున్న శిక్షణ ఆధారంగా విద్యార్థులు సైన్స్ సూత్రాలను ఆకళింపు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 16, 17 తేదీల్లో సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్లో జరిగే బాలోత్సవం-నాలుగో పిల్లల సంబరాల్లో ఎక్కువ స్కూల్స్ నుండి ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనాలని కోరారు. బాలోత్సవ కమిటీ ప్రయత్నాన్ని అభినందించారు. సభాధ్యక్షులు విజెఎంఏవిఆర్.కృష్ణారావు మాట్లాడుతూ స్కూలుకి సీనియర్స్ కేటగిరీలో ఇద్దరు చొప్పున బాలోత్సవంలో మేజిక్ ప్రదర్శన ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.దేవేంద్ర నీళ్ల రంగు మారడం, నీళ్లతో నిండిన ప్లాస్టిక్ కవర్లో పెన్నులతో గుచ్చినా నీళ్ళు కారకపోవడం, పేపర్ల రంగులు మారడం, తెల్ల కాగితంపై అక్షరాలు రావడం, పేపర్ల యాంగిల్స్ ఆధారంగా సైజులు మారడం, గ్లాసులో నీరు ఆవిరి కావడం తదితర విషయాలపై విద్యార్థులను భాగస్వాములను చేసి మేజిక్ షో నిర్వహించి వాటికి సంబంధించిన సైన్స్ సూత్రాలను విద్యార్థులకు అవగాహన చేశారు. బాలోత్సవ నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మేజిక్ షో విద్యార్థులు కూడా చేయొచ్చని, అందుకు ఆసక్తి పెంచుకోవాలని కోరారు. వచ్చే వారంలో వివిధ పాఠశాలల్లో స్థానికంగా ఎక్కడికక్కడ శిక్షణ ఇచ్చేందుకు జనవిజ్ఞాన వేదిక సహకారంతో ఏర్పాటు చేస్తామన్నారు. ఎఆర్‌డిజికె హైస్కూల్లో ఈ శిక్షణా కార్యక్రమానికి అవకాశం ఇచ్చినందుకు హెడ్ మాస్టర్, టీచర్లకు నరసింహారావు ధన్యవాదాలు తెలిపారు.

ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో పేదల పొట్ట కొట్టొద్దు

వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఐదో కాంటూరుపైన 10 కిలోమీటర్ల వరకు పర్యావరణం పేరుతో 26 నిబంధనలను పెట్టి వేలాదిమంది ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లుకు జిల్లా కమిటీ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరుతో జిరాయితీ, సొసైటీ చెరువులను ధ్వంసం చేసి కొల్లేరు ప్రజలను అనాధలను చేశారని, నేడు మళ్లీ పర్యావరణ సున్నిత ప్రదేశం పేరుతో ఐదో కాంటూరుపైన ఉన్న 89 గ్రామాల ప్రజలను కొంప కొల్లేరు చేసే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాల ప్రజలు ఐక్యమై దీన్ని ప్రతిఘటించాలని, అలాగే అన్ని గ్రామాల్లో ఉన్న పంచాయతీలు తీర్మానాలు చేసి తమ వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు ఎకో సెన్సిటివ్ జోన్‌కు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం ప్రజల కంటే పక్షులకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం దుర్మార్గమన్నారు. ప్రజలకు అటవీశాఖ, కేంద్ర ప్రభుత్వం వాస్తవ విషయాలను చెప్పి ప్రజాభిప్రాయ సేకరించడం బదులు కేవలం మండల కేంద్రాల్లో కొద్దిమందితో అభిప్రాయ సేకరణ జరిపి ప్రజలకు వ్యతిరేక అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే చూస్తూ ఊరుకోబోమని వారు హెచ్చరించారు. కొల్లేరులోని 22 వేల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం కొల్లేరు చుట్టుపక్కల నుండి వస్తున్న మురుగునీరు నివారణకు చర్యలు ప్రభుత్వం చేపట్టాలని, కొల్లేరు ప్రాంతంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొల్లేరు ప్రాంతంలో దళితులు, పేదలు వలసలు వెళ్తున్నారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్య ప్రభుత్వం దృష్టిలో పెడతామని, కొల్లేరు వాసుల సమస్య పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించి సమస్యలు తెలుసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దాసు, ప్రసాద్ పాల్గొన్నారు.



వినతిని అందిస్తున్న నాయకులు

వికసిత్ భారత్ సంకల్పయాత్రను వినియోగించుకోండి

కార్యక్రమ జిల్లా పర్యవేక్షకులు ఉమా నందూరి

ప్రజాశక్తి - భీమడోలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్ధి పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రత్యేకించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, కార్యక్రమ జిల్లా పర్యవేక్షకులు ఉమా నందూరి కోరారు. జిల్లాస్థాయిలో కార్యక్రమ అమలుకు పైలెట్ గ్రామంగా భీమడోలు ఎంపికైంది. ఈ నేపథ్యంలో భీమడోలులో బుధవారం సర్పంచి పి.సునీత మాన్‌సింగ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఉమా నందూరితోపాటు జిల్లా నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి, మండల ప్రత్యేక అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌తోపాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ ఇదే అంశంపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహనా సదస్సులో పాల్గొన్నారు. పంచాయతీ వద్ద నిర్వహించిన సభలో కార్యక్రమ అమలుకు నిర్దేశించిన 17 అంశాలపై సదరు శాఖల అధికారులు ప్రగతి తెలియజేశారు. ఈ సందర్భంగా పర్యవేక్షకులు నండూరి ఉమకు సర్పంచి సునీత మాన్‌సింగ్, కార్యదర్శి ఠాగూర్ ఘనస్వాగతం పలికారు. ఐసిడిఎస్ నిర్వహించిన సామాజిక వేడుకల్లోను, పిఎం ఉజ్వల యోజన లబ్ధి పంపిణీ, వ్యవసాయ శాఖ, బ్యాంక్ అనుబంధాలు ఇతర అంశాల కరపత్రాలు, పుస్తకాలను పర్యవేక్షణాధికారి ఆవిష్కరించారు. 28 సంవత్సరాలుగా భీమడోలు కేంద్రంగా సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం బ్రోచర్లను సంఘం ఛైర్మన్ డాక్టర్ పి.మాన్‌సింగ్ విజ్ఞప్తి మేరకు ఆవిష్కరించారు. సాంస్కృతిక నృత్యాలను ప్రదర్శించిన మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు కావ్యశ్రీ, శశికలను పర్యవేక్షణాధికారి ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం పంచాయతీ తరఫున ఉమా నండూరిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమడోలులో కార్యక్రమాల అమలు తీరు బాగుందన్నారు. తన మేనమామ భీమడోలువాసులు కావడంతో ఈ గ్రామంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు.

జిల్లాకు యాత్ర ప్రచార వాహనాలు గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ యాత్ర కార్యక్రమాలు పూర్తిస్థాయిలో విజయవంతమయ్యేందుకు అందరూ సహకరించాలని కోరారు. డిపిఒ తూతిక విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామ సర్పంచి, కార్యదర్శి కృషి, సహకారం, ఎంపిడిఒ, తహశీల్దార్ పర్యవేక్షణలో కేంద్ర, రాష్ట్ర పథకాల అమలుకు పైలెట్ గ్రామంగా భీమడోలు మారిందన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఆవరణలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం భీమడోలులోనే ప్రారంభమై ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. సర్పంచి సునీత మాన్‌సింగ్ మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన భీమడోలుకు ప్రాచీన, జానపద, గిరిజన కళల పునరుద్ధరణ కోసం ఆర్ట్ థియేటర్ మంజూరు చేయాలని కోరారు. సాంగ్ అండ్ డ్రామా కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టి.భవానిరంగా, ఎంపిటిసి ముళ్లగిరి జాన్సన్, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు టౌన్:జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ నందు వైద్యుల పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట తెలిపారు. గైనకాలజిస్ట్ ఒక పోస్టు, మత్తు వైద్యులు ఆరు, పిల్లల వైద్యుడు ఒకటి, జనరల్ ఫిజీషియన్ 2, జనరల్ సర్జన్ 1, గుండె వైద్య నిపుణులు ఒక పోస్టుకు ఏడాది కాలానికి కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు https://westgodavari.ap.gov.in , https://eluru.ap.gov.in లో పొందుపరచిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని, దానితో పాటు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ సెట్ ఏలూరులోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఈనెల 24, 25 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ కార్యాలయ పని దినాల్లో మాత్రమే సమర్పించాలని కోరారు. జిల్లా వెబ్‌సైట్‌లో తెలిపిన ఉద్యోగాలకు తగిన అర్హత ధృవపత్రాలు జతచేయని, దరఖాస్తులో ఖాళీలను పూరించని వారి దరఖాస్తులను తిరస్కరించబడతాయన్నారు. ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపబడవని వివరించారు.

సచివాలయ ఉద్యోగులకు యూనిఫారం తప్పనిసరి

చింతలపూడి :సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా యూనిఫారం ధరించాలని ఎంపిడిఒ మురళీకృష్ణ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం జరిగిన కులగణన శిక్షణ కార్యక్రమంలో హాజరైన సచివాలయ ఉద్యోగులు యునిఫామ్ వేసుకురాకపోవడంతో అగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో మనం పనిచేస్తున్నామా లేదా అనేది మన పద్ధతి బట్టి ఉంటుందని, యూనిఫామ్ అనేది సచివాలయ ఉద్యోగులకు ప్రాధాన్యం అని తెలిపారు. మరోసారి ఈ విధంగా జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాలీబాల్ పోటీల్లో 'శివాజీ' విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం:యూనివర్సిటీ స్థాయి వాలీబాల్ పోటీల్లో స్థానిక చత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా విభాగం వాలీబాల్ జట్టు మొదటి స్థానంలో విజయం సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు తెలిపారు. బుధవారం జరిగిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ప్రసాద్‌బాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన వారిలో కె.జయశ్రీ, బి.ఢిల్లీశ్వరి, వి.ప్రవల్లిక సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్.వినయ్‌కు అభినందనలు తెలిపారు. స్పోర్ట్స్ విభాగ విద్యార్థులందరూ ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారికి కావాల్సిన సహాయ సహకారాలు కళాశాల తరపున అందిస్తామన్నారు.

వర్షం.. బేజారెత్తుతున్న రైతాంగం


కల్లాల్లో ధాన్యం.. పనలపై పైరు - పంటను రక్షించుకునేందుకు రైతుల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి



పనలు కడుతున్న రైతులు

ఖరీఫ్ సాగు ఆరంభం నుంచి అన్నదాతను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. నిన్నటి వరకు వర్షాభావంతో చేలకు సాగునీరు సక్రమంగా అందక వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఆయిల్ ఇంజిన్ల సాయంతో రైతులు నీటిని సమకూర్చుకున్నాడు. ఎట్టకేలకు పంట చేతికొచ్చిన సమయంలో అల్పపీడనం రూపంలో వాన రైతులను భయపెడుతోంది. మండలంలో ముందుగా నాట్లు వేసిన పలు గ్రామాల్లో కోతలు సాగుతున్నాయి. కొందరు రైతులు నూర్చిన ధాన్యపు రాశులను కల్లాల్లో ఆరబెట్టే పనిలో ఉన్నారు. ఈ తరుణంలో బుధవారం ఉదయం కురిసిన వర్షం రైతుల గుండెల్లో గుబులు రేపింది. దీంతో పంటను రక్షించుకునేందుకు రైతులు పరుగులు పెట్టారు. సుమారు 9 గంటల ప్రాంతంలో ఆకస్మాత్తుగా వర్షం కురిసింది. వర్షం తగ్గిన తర్వాత చేలకు చేరుకొని పంటను కాపాడుకునేందుకు రక్షణ చర్యలు చేపట్టారు. ధాన్యపు రాశులపై పరదాలు కప్పి, వరి పనలను ట్రాక్టర్‌పై లోడు చేసి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. కొన్ని గ్రామాల్లో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యంపై పట్టాలు కప్పి ఉంచారు. మండలంలో మెరక ప్రాంతాల్లో చాలావరకు వరికోతలు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో డిసెంబర్ మొదటి వారంలో కోతలు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో వర్షాలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వం కూడ వాతావరణం దృష్ట్యా నిబంధనలు సడలించి తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



వరి పనలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు

'జగన్ పాలన అవినీతి రహితం'

ముదినేపల్లి:సిఎం జగన్ అవినీతి లేని పాలన అందిస్తున్నారని, కుల, మత ప్రాంతాలకు అతీతంగా పాలన సాగుతుందని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం ముదినేపల్లి-1 సచివాలయ పరిధిలో వైసిపి నేతలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సత్యనారాయణ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో అన్ని రాష్ట్రాల కన్నా మిన్నగా అందరికి మేలు చేశారన్నారు.


ఉంగుటూరు:కైకరం-1 సచివాలయ పరిధిలో 'రాష్ట్రానికి జగనే సిఎం ఎందుకు కావాలంటే' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు అన్నారు. బుధవారం సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డ్ ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరించి, వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. సచివాల య పరిధిలో వెంకటకృష్ణాపురం, రామన్నగూడెం, బ్రహ్మానందపురం గ్రామాల్లో ఇంటిం టి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి, వైసిపి పంచాయతీరాజ్ విభాగ జిల్లాఅధ్యక్షులు పుప్పాల గోపి, పాల్గొన్నారు.

ఇసుక సమస్య పరిష్కరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు

ప్రజాశక్తి - కలిదిండి

ప్రభుత్వ విధానాల వల్ల భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో పోతురాజు బాలాజీ అధ్యక్షతన జరిగిన ఆ సంఘ మండల కమిటీ సమావేశంలో రమణారావు మాట్లాడారు. ఇసుక సమస్యను పరిష్కరించి, నిర్మాణ కార్మికుల ఉపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటినుండి నిర్మాణ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. నాయకులు ఇసుక మాఫియాతో కుమ్మక్కై ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుక దొరకని పరిస్థితుల్లోకి నెట్టేయడంతో నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. నిర్మాణ మెటీరియల్ ధరలు అధికం కావడంతో నిర్మాణ పనులకు పెను భారంగా మారాయన్నారు. ప్రభుత్వం ధరలను నియంత్రించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతోపాటు ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను బోర్డుకు జమ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ వంశీకి అందచేశారు. కార్యక్రమంలో నాయకులు పరసా రాజేష్, కటికరెడ్డి శ్రీను, అల్లాడి భోగేశ్వరరావు, బత్తిన సూరిబాబు, సానబోయిన సత్యనారాయణ, షేక్ అక్బర్ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

ఆక్వా యూనివర్సిటీ విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు పంపిణీ

- త్వరలో తరగతులు ప్రారంభం
- తీరప్రాంత అభివృద్ధికి సిఎం జగన్ ప్రత్యేక దృష్టి
- మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఆక్వా యూనివర్సిటీలో ప్రవేశాలకు ఎంపికైన మొదటి సంవత్సరం విద్యార్థులు 60 మందికి బుధవారం మత్స్యశాఖా మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని కాటన్ పార్కులో బుధవారం నిర్వహించిన సభలో ఈ పత్రాలు మంత్రి అప్పలరాజు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన తిరుమాని నాగరాజుచే బిసి కార్పొరేషన్ సంక్షేమ అధికారి ఎన్.పుష్పలత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఆక్వా యూనివర్సిటీ ఒఎస్‌డి డాక్టర్ ఒగిరాల సుధాకర్, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, ఆక్వా యూనివర్సిటీ సిఓఇ డాక్టర్ టి వి రమణ, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్ ప్రసాదు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ పాల్గొన్నారు.

సమర్థవంతంగా కులగణన

ప్రజాశక్తి - చింతలపూడి

కుల గణన ప్రక్రియ మండలంలో సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపిపి బి.రాంబాబు సంబంధిత అధికారులకు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎం.మురళీకృష్ణ ఆధ్వర్యంలో తహశీల్దార్ కృష్ణ జ్యోతి అధ్యక్షతన కులగణనపై సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ కులగణన చేపట్టడం హర్షణీయమన్నారు. దీనిద్వారా ప్రతివ్యక్తికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కిరణ్ కుమార్, ఇఒపిఆర్‌డి విక్టర్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఈనెల 27వ తేదీ నుండి జనగణన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి.వి.విజయ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఈ కార్యక్రమం సచివాలయ సిబ్బంది, ఇతర అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా చేపట్టాలన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన సంద్రకుంటలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బుట్టాయగూడెం గ్రామానికి చెందిన గంటా దాసు(50) పావులూరివారిగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం యథావిధిగా విధులకు వెళ్లిన దాసు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గుండెపోటు వచ్చింది. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయారు. పావులూరివారిగూడెం నుండి వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా సంద్రకుంట ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఈ ఘటనతో సంద్రకుంట గ్రామం శోకసంద్రంలో మునిగింది. బుధవారం దాసు భౌతికకాయాన్ని ఎంఇఒ-2 వెంకట్రావు, యుటిఎఫ్ నాయకులు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

మండవల్లి పిహెచ్‌సి రెండో వైద్యాధికారిగా పవిత్ర

ప్రజాశక్తి - మండవల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర రెండో వైద్యాధికారిగా డాక్టర్ ఎస్.పవిత్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ కాంట్రాక్ట్ ఉద్యోగస్తురాలిగా వెళ్లడంతో వైద్యశాలలో రెండో వైద్యురాలి పోస్ట్ గత కొంతకాలంగా ఖాళీగా ఉంటుంది. దీంతో పోస్టును భర్తీ చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందిస్తానని పవిత్ర తెలిపారు.



చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ మేకా ప్రతాప్

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది మందికి సిఎం రిలీఫ్ ఫండ్‌ను చెక్కులను ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎనిమిది మందికి రూ.లక్ష చొప్పున ఒకరికి రూ.రెండు లక్షలు మొత్తం రూ.పది లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేదల ఆరోగ్యం, సంక్షేమ సిఎం జగన్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ ఇ.విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నారు. ధాన్యం కొన్న తర్వాత 21 రోజుల్లో రైతులకు ప్రభుత్వం నగదును జమ చేస్తుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఛాముండేశ్వరి, సివిల్ సప్లయిస్ టెక్నికల్ అసిస్టెంట్ ఎన్.బ్యూలా పాల్గొన్నారు.

కలిదిండి ఎంపిడిఒగా దినతేజ్

ప్రజాశక్తి - కలిదిండి



కలిదిండి ఎంపిడిఒగా జి.దినతేజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కోనసీమ జిల్లా గాడిలంకకు చెందిన దినతేజ్ (గ్రూప్-1 ద్వారా ఎంపికై కలిదిండి ఎంపిడిఒగా నియమితులయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయనకు కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇప్పటి వరకూ ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపిడిఒ రాంబాబు సెలవులో ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి ఎమ్‌డి రజాఉల్లా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వాలంటీర్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేలా చూడటం, పథకాలు పొందిన వారు వాటిని ఎలా ఉపయోగించుకుంటున్నదీ వారి ద్వారానే తెలియజేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని గుర్తించి సన్మానించాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.


నేరాలు - ఘోరాలు

ఏలూరు కాలువలో జారి వ్యక్తి మృతి

భీమడోలు: ఏలూరు కాలువలో స్నానానికి దిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు వద్ద బుధవారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూరప్పగూడేనికి చెందిన చామర్తి శ్రీనివాసరావు కార్తీకమాసం సందర్భంగా తనతల్లితో పాటు స్నానం చేసేందుకు ఏలూరు కాలువ వద్దకు వచ్చారు. తొలుత వృద్ధురాలైన తల్లికి స్నానం చేయించి ఆమెను గట్టుపై కూర్చోబెట్టాడు. ఆ తరువాత స్నానానికి దిగిన శ్రీనివాసరావు కాలుజారి కాలువలో కొట్టుకుపోయాడు. అతన్ని రక్షించేందుకు సమీపంలో ఉన్నవారు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. వెంటనే స్థానికులు భీమడోలు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ నాగరాజు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని శ్రీనివాసరావు కోసం గాలించారు. గంటపాటు గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పైనుంచి జారి మహిళకు తీవ్ర గాయాలు

ముదినేపల్లి: బైక్ పైనుంచి జారిపడ్డ మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కాకరవాడ శివారు దేవరం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. దేవరం గ్రామానికి చెందిన కాగిత లక్ష్మి (40) తన భర్త శివయ్యతో కలిసి ముదినేపల్లిలోని బ్యాంకుకు బైక్‌పై బయల్దేరింది. గ్రామం వెలుపల జెడ్‌పి రహదారిపై మలుపు వద్ద ఆక్వా రైతు అనధికారికంగా స్పీడ్‌బ్రేకర్ ఏర్పాటు చేసి ఆయిల్ ఇంజన్ పైప్ రోడ్డుకు అడ్డంగా పెట్టి చేపల చెరువుకు నీటిని తోడుతున్నాడు. ఇది గమనించని లక్ష్మి భర్త స్పీడ్‌బ్రేకర్ వద్దకు వచ్చాక గుర్తించి సడన్ బ్రేక్ వేయడంతో లక్ష్మి జారి పడింది. ఈ ప్రమాదంలో లక్ష్మి కుడి చెయ్యి విరిగింది. దీంతో ఆమెను మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపై అనధికారికంగా స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుపై ఆక్వా రైతును గ్రామస్తులు ప్రశ్నించగా మీకు చేతనైంది చేసుకోండని దూషించాడని పలువురు చెబుతున్నారు.



రక్త మార్పిడి చేస్తున్న రెడ్‌క్రాస్ వైద్యులు

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో 13 మంది తలసేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి చేశామని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు క్రమం తప్పకుండా రెండు నుంచి మూడుసార్లు రక్తమార్పిడి చేయించుకోవాల్సి ఉంటుందని, కాబట్టి రక్తదాతలు స్పందించి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. మధ్యాహ్నం చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 35 మందికి దాతలు కొమ్మన బాలగంగాధర్ తిలక్, ద్రోణపల్లి వెంకటసుబ్బారావు ఉచిత భోజనం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, రెడ్ క్రాస్ గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, మానవత సభ్యురాలు భారతి, రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

సిఎంకు నూజివీడు ఎంఎల్ఎ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకటప్రతాప్‌అప్పారావు సిఎం జగన్‌ను బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నూజివీడు విచ్చేసిన సందర్భంగా నూజివీడుకు పలు హామీలను ప్రకటించడంపై సిఎంకు ఎంఎల్ఎ కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఎ వెంట ఆయన కుమారుడు మేక వేణుగోపాల అప్పారావు కూడా ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ట్రాన్స్‌కో ఇఇ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి బుధవారం విద్యుత్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల అర్జీలను అదాలత్‌లో అందిస్తే తక్షణం పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదాలత్ సభ్యులు ఎస్ఎ.మురళీమోహన్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చింతలపూడి విద్యార్థులు

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చింతలపూడి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-19 కబడ్డీ పోటీలు శృంగవృక్షంలో జరిగాయి. ఈ పోటీల్లో చింతలపూడి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు వి.మురళీకృష్ణ తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టులో శివ చంద్ర, కౌశిక్ నాయుడు, ఉదయ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల చిత్తూరు జిల్లాలో 24, 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కొత్తగూడెంలో ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - చాట్రాయి

కొత్తగూడెంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సర్పంచి చల్లగుళ్ల వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు తపన ఫౌండేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధి రఘు మాట్లాడుతూ మూడు నెలల పాటు నిర్వహించే ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ల అంజయ్య, బిజెపి మండల అధ్యక్షులు ఒబిళ్లనేని రాజా, ట్రైనింగ్ టీచర్ షేక్ షాహీనా, తపన ఫౌండేషన్ వాలంటీర్ జిగిరి కేశవ, నరసింహారావు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రసాద్‌బాబు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చాట్రాయి: మండల కేంద్రమైన చాట్రాయి రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. వైసిపి మండల నాయకులు దామెర ప్రసాద్‌బాబు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులకు, ప్రయివేటు వ్యాపారులకు ధాన్యం అమ్మి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయాధికారి. శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

'మానవత' సేవల్లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - భీమడోలు



సాయం చేస్తున్న మానవత ప్రతినిధులు

మానవత స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవ, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ కోరారు. మండలంలోని పూళ్ల శాఖా గ్రంథాలయ ఆవరణలో బుధవారం శాఖ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చేనెలలో మానవత సంస్థకు చెందిన జిల్లా విద్యానిధి నుంచి స్థానికంగా ఉన్న ఇద్దరు విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు పురస్కారం అందజేయాలని తీర్మానించారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశంలో భాగంగా కుటుంబ యజమానులు చనిపోయిన కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మూడు కుటుంబాల వారికి, కుటుంబ యజమాని వ్యాధిగ్రస్తులు కావడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక కుటుంబానికి సంస్థ తరపున బియ్యం, నిత్యావసర వస్తువులతోపాటు భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ షో రూం సౌజన్యంతో ఆ నాలుగు కుటుంబాల వారికి దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : సామంతపూడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్య నారాయణ రాజు అన్నారు. మండలంలోని కె.జగ్గవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సొసైటీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రైతులు దళారుల వద్ద మోసపోకుండా ప్రభుత్వమే మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. కె.జగ్గవరం సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తెడ్లం, రాజుపోతేపల్లి, కేతవరం, అల్లంచర్ల, రాజుపాలెం, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం రైతు భరోసా కేంద్రాల పరిధిలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తడికలపూడి శివమాధవి కిషోర్, వంటిపల్లి వెంకటేశ్వరరావు, రవిచంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు, సిఇఒ తనగాల వీరవెంకయ్య, రైతులు వంటిపల్లి సుబ్రహ్మణ్యం, వెలిది రాంబాబు, వెలిది గంగాధర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌పై అవగాహన అవసరం

ఏలూరు అర్బన్: శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి అన్నారు. ఏలూరు మండలం జాలిపూడిలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారం, ఉచిత న్యాయ సహాయం అందించడం, చట్టాలపైన అవగాహన కల్పించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం రూపొందించారని, ఈ చట్టంలో భాగంగా శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు చేశామని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్‌లో విద్య, వైద్యం, పోస్టల్, బీమా, రియల్‌ఎస్టేట్, రవాణా, పారిశుధ్యం, బ్యాంకింగ్, ఎన్ఆర్ఇజిఎస్, టెలికాం సేవల్లో లోపం జరిగితే విచారణ జరుగుతుందని తెలిపారు. అదాలత్‌లో తీర్పులకు అప్పీలు ఉండదని, రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కక్షిదారులు, సంబంధిత అధికారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వచ్చేనెల తొమ్మిదో తేదీన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, ఈ అదాలత్‌లో సివిల్, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ తగాదా కేసులు, చిట్స్ అండ్ ఫైనాన్స్, అన్ని రకాల ఇపిలు, బ్యాంకు లావాదేవీ కేసులు, రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులను రాజీ చేస్తామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వి.నవ్య, గ్రామ కార్యదర్శి ఎస్.కుమార్, విఆర్ఒ టి.రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చింతలవల్లిలో రూ.31.18 కోట్ల అభివృద్ధి పనులు : కోటగిరి

ప్రజాశక్తి - ముసునూరు



చింతలవల్లిలో ప్రణాళిక బోర్డునుఆవిష్కరిస్తున్న నాయకులు

చింతలవల్లి సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్ల కాలంలో రూ.31,18,18,650 నిధులను సిఎం జగన్ మంజూరు చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన పేర్కొన్నారు. చింతలవల్లి సచి వాలయంలో సర్పంచి పల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో పల్లెకు -పోదాం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ పరిధిలో సచివాలయం, రైతు భరోసాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్ (ఆరోగ్యకేంద్రం), నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి ఇలా ఎన్నో అభివృద్ధి పనులతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బసవరాజు, అచ్యుత సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధ దంపతులను ఆదుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ కోరారు. వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న దంపతులను మనసున్న దాతలు ఆదుకోవాలని కోరుతూ స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ సమీపంలో నివసిస్తున్న చిటికిన సత్యనారాయణ, సీతమ్మ వృద్ధులకు మానవత సేవా సంస్థ ద్వారా ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూ.రెండు వేలు నగదు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మానవత' ద్వారా సుంకర నాగదేవి భర్త రామకృష్ణ జ్ఞాపకార్థం మూడు నెలలకు సరిపడు సరకులు, బియ్యం, రూ.రెండు వేలు నగదు అందజేశారని తెలిపారు. అలాగే సుబ్రహ్మణ్యం స్వామి అన్నదాన ట్రస్ట్ తరపున నాగసూరి వసంతకుమార్ సరుకులు, బియ్యం ఇచ్చారని తెలిపారు . ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్.శంకర్‌రావు మాట్లాడుతూ సత్యనారాయణ, సీతమ్మ దంపతులు బట్టలు ఇస్త్రీ చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారని తెలిపారు. సత్యనారాయణకు ఐదుగురు కుమారులని అయితే అందరూ చనిపోయారని చెప్పారు. వృద్ధాప్యంలో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ సొమ్ములు, ఇస్త్రీ బండి ద్వారా వచ్చే ఆదాయంతోనే జీవిస్తున్నారని తెలిపారు. మూడేళ్ల క్రితం పాము కాటుకు గురి కావడంతో కుడి కాలుకు మూడుసార్లు ఆపరేషన్ చేయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వారి దీన స్థితిని తెలియజేయడంతో మానవత జిల్లా కన్వీనర్ తిరుపతి త్రిపుర రమేష్ ముందుకు వచ్చి నాగదేవి ద్వారా సహాయం అందించారని శంకర్‌రావు ధన్యవాదాలు తెలిపారు. అలాగే తమ యూనియన్ తరపున రూ.వెయ్యి, అనన్య చిత్రం యూనిట్ ద్వారా రూ.వెయ్యి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో త్రిపుర రమేష్, దాతలు సుంకర నాగదేవి, నాగసూరి వసంతకుమార్, మానవత కార్యదర్శి గద్దె సత్యనారాయణ, కోశాధికారి ఇమ్మంది మాధవరావు, కార్యవర్గ సభ్యులు ఎల్.రఘురాం, అనన్య డైరెక్టర్ బి.ప్రసాదరాజు, హీరో వెంకట్ పాత్రికేయులు గొల్లమందల శ్రీనివాస్, రామారావు, కలపాల శ్రీనివాస్, రవికిరణ్, అచ్యుత సూర్య, కుమార్ పాల్గొన్నారు.

4న జంగారెడ్డిగూడెంలో బాలోత్సవం



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం బాలోత్సవం-1 పిల్లల పండుగ వచ్చేనెల నాలుగో తేదీన స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించేందుకు సన్నాహక సమావేశం నిర్ణయించింది. డాక్టర్ కె.వజ్రకిరణ్ అధ్యక్షతన వజ్రసౌధలో బాలోత్సవం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉండే సృజనాత్మక ఆలోచనలు పెంచడానికి బాలోత్సవాలు గొప్ప వేదిక అని అన్నారు. అన్ని సంఘాలు సంయుక్తంగా పండుగగా నిర్వహించడానికి బోడేపూడి సుందరయ్య ట్రస్ట్, మానవత, రోటరీ, లయన్స్ క్లబ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, ఉపాధ్యాయ సంఘాలు సహకరించడం శుభపరిణామమన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.వి.శ్యామ్‌బాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణం, రూరల్ మండలానికి చెందిన రెండో తరగతి నుండి పదో తరగతి చదివే విద్యార్థులకు బాలోత్సవం నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా ఐ.వెంకటరమణమూర్తి (మానవత మూర్తి), అధ్యక్షులుగా డాక్టర్ కె.వజ్రకిరణ్, గౌరవ సలహాదారులుగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, ఎం.వి.శ్యామ్‌బాబు, కార్యదర్శిగా టి.వెంకన్నబాబు, కోశాధికారిగా ఎన్.వెంకటేశ్వరరావు, అకాడమిక్ అంశాల కో ఆర్డినేటర్‌గా ఎమ్‌డి ఆలీ, కల్చరల్ అంశాల కో ఆర్డినేటర్‌గా కె.నాగేశ్వరరావు మొత్తం 50 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. హేలాపురి బాలోత్సవం కమిటీ నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఈ బాలోత్సవం జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మానవత కమిటీ సభ్యులు డి.రామాంజనేయరెడ్డి, గద్దె సత్యనారాయణ, జె.మాధవరావు, త్రిపురారమేష్, శిరీష, కృష్ణబాబు, ఎం.మాధవరావు, డికె.రెడ్డి, పివి.కృష్ణమూర్తి, రిటైర్డ్ ఉద్యోగులు టివి.గోపాలరావు, ఎ.రామచంద్రరావు, వెంకటేశ్వరరావు, ఆలి, కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.